నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 11 జూలై 2024 | HYDERABAD

కాంట్రాక్ట్ నర్సులకు జీతాలు చెల్లింపు

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది జీతాల విషయంలో ఎట్టకేలకు తెలంగాణ సర్కారు దిగివచ్చింది. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులకు గురవుతున్న టిమ్స్ కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది ఆవేదనను 'జీతాలో రాజనర్సింహ' పేరుతో ఈనెల 9న 'నమస్తే'లో ప్రచురించిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. నగర వ్యాప్తంగా వివిధ దవాఖానల్లో విధులు నిర్వర్తిస్తున్న 180 మంది టిమ్స్ కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి బుధవారం రెండు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించారు. రెండు నెలల జీతాలు ఒకేసారి చెల్లించడంపై నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి చిరు ఉద్యోగులకు ఇక నుంచి క్రమం తప్పకుండా జీతాలు చెల్లించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని నర్సింగ్ సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఓయూ కాలనీలో వ్యర్థాలు తొలగించకపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు అవస్థలుపడుతున్నారు.

రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదిలా ఉండగా.. నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.6, కనిష్ఠం 24.0 డిగ్రీలు, గాలిలో తేమ 50శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో నిర్మాణం

మొదటి అంతస్తులో రోడ్డు..
రెండో అంతస్తులో మెట్రో మార్గం

ఎన్‌హెచ్‌ఏఐకి హైదరాబాద్ మెట్రో ప్రతిపాదన

జాతీయ రహదారులపై మెట్రో కారిడార్ల నిర్మాణంపై క్షేత్ర స్థాయి సమీక్ష

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ):మెట్రో రైలు రెండో దశలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులోని కారిడార్లను అనుసంధానిస్తున్న మార్గాలు జాతీయ రహదారులపైనే ఉన్నాయి. దీంతో జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ప్రస్తుతం ఎల్బీనగర్-హయత్‌నగర్ మెట్రో మార్గాన్ని 7 కి.మీ నిర్మిస్తుండగా, మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో 13 కి.మీ పొడవుతో నిర్మిస్తున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విజయవాడ, హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లే ఈ రెండు మార్గాల్లో ఎన్‌హెచ్ అధికారులు జాతీయ రహదారుల విస్తరణతో పాటు ఫ్లై ఓవర్లను నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఎన్‌హెచ్ అధికారులు సమగ్రంగా చర్చించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో దశలో చేపట్టే మార్గాల్లో పలు మార్పులు చేసి కొత్త ప్రతిపాదనలు రూపొందించామని, అందులో భాగంగా మియాపూర్-పటాన్‌చెరు మెట్రో కారిడార్‌లో మదీనగూడ(గంగారం) నుంచి 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించామని మెట్రో అధికారులు తెలిపారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)కి ప్రతిపాదనలు సమర్పించామని వివరించారు. ఈ మార్గంలో జాతీయ రహదారి సెంట్రల్ మీడియన్ (మధ్యలో)లోనే మెట్రో పిల్లర్లు నిర్మించాల్సి ఉన్నదని, ఇరువైపు ఉన్న రోడ్లపై వివిధ మతపరమైన కట్టడాలు, మంచినీటి పైపులు, విద్యుత్ కేబుళ్లు, ఇతర లైన్లు ఉండటంతో నేషనల్ హైవే అథారిటీతో కలిసి 1.2 కి.మీ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించాల్సి వస్తోందని, బీహెచ్‌ఈఎల్ జంక్షన్‌లో ఆర్టీసీ బస్‌స్టేషన్‌తో మెట్రో స్టేషన్‌ను అనుసంధానించే డిజైన్లు రూపొందించామని తెలిపారు.

మెట్రో రెండో దశ ప్రాజెక్టులో భాగంగా జాతీయ రహదారిపై నిర్మించే మార్గాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు

చింతల్‌కుంట వరకు సెంట్రల్ మీడియన్‌లోనే..

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7 కి.మీ పొడవుతో రెండో దశలో మెట్రో రైలు కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఎల్బీనగర్ చౌరస్తా నుంచి చింతల్‌కుంట వరకు మెట్రో మార్గాన్ని రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ మీడియన్‌లోనే నిర్మించాలని నిర్ణయించామని మెట్రో అధికారులు తెలిపారు. చింతల్‌కుంట నుంచి మెట్రో మార్గాన్ని హయత్‌నగర్ వరకు ఎడమ వైపు ఉన్న సర్వీసు రోడ్డు మార్గంలో నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత మెట్రో కారిడార్‌పై నిర్ణయం తీసుకున్నామని మెట్రో అధికారులు తెలిపారు. ఈ మార్గంలో నిర్మించాలని ప్రతిపాదించిన 6 మెట్రో స్టేషన్ల నిర్మాణంలో స్వల్ప మార్పులు చేశామన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి నుంచి కొత్త హైకోర్టు వరకు..

రెండో దశ మెట్రో కారిడార్‌లో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించే మెట్రో కారిడార్‌లోనే మైలార్‌దేవ్‌పల్లి నుంచి మరో మార్గాన్ని కొత్తగా నిర్మించే హైకోర్టు వరకు నిర్మిస్తున్నారు. ఈ మార్గం జాతీయ రహదారిపై ఉండటంతో ఎన్‌హెచ్ అధికారులతో చర్చించామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ వరకు ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా వచ్చి..హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై కలుస్తుంది. ఇప్పటి వరకు మెట్రో మార్గాన్ని ఎడమ వైపు నిర్మించాలని నిర్ణయించగా, దాన్ని కుడివైపు మార్చామన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైపు మెట్రో మార్గం నిర్మించేందుకు చాలా అనుకూలంగా ఉన్నదని, క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల విభాగం ఇంజినీర్ ఇన్‌చీఫ్ గణపతిరెడ్డి, ఎస్‌ఈ పి.ధర్మారెడ్డి, హైదరాబాద్ మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్ మోహన్, ఎస్‌ఈ వై.సాయపరెడ్డి, జీఎంలు బీఎన్ రాజేశ్వర్, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డిలతో జనరల్ కన్సల్టెంట్ సంస్థ సిస్ట్రా ఇంజినీర్లు పాల్గొన్నారు.

స్విగ్గీ బాయ్.. డ్రగ్స్ దందా

శంషాబాద్ రూరల్, జూలై 10 : ఓ స్విగ్గీ డెలవరీ బాయ్ నుంచి శంషాబాద్ ఎస్‌వోటీ, ఆర్‌జీఐఏ పోలీసులు 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని వివిధ లాడ్జీలు, హోటళ్లలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు పక్క సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. మంగళవారం రాత్రి సమయంలో శంషాబాద్ పట్టణంలోని ఓ హోటల్ వద్ద ఒకరు ఎండీఎంఏ డ్రగ్ అమ్ముతుండగా, పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురళీధరన్‌గా గుర్తించారు. నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి తో కలిసి బెంగళూరులో నివాసముంటూ.. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు మూడు నెలల్లోనే స్థానచలనం

7 నెలల్లో రాచకొండకు నలుగురు కమిషనర్లు

రెండో సారి కమిషనర్‌గా సుధీర్‌బాబు నియామకం

బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌బాబు

ఐపీఎస్‌లతో బదిలీల బంతాట!

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐపీఎస్ అధికారులతో బదిలీల బంతాట ఆడుతున్నది. ఒకటి రెండు నెలలు పని చేయకముందే బదిలీలు చేస్తూ అధికారులను పూర్తి స్థాయిలో పనిచేయనీయకుండా చేస్తూ.. తమకు పాలనపై ఏ మాత్రం అవగాహన లేదనే విషయాన్ని పదే పదే రుజువు చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు ఏడు నెలల్లోనే నలుగురు అధికారులు బదిలీ కావడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఒక అధికారి ఒక కమిషనరేట్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలంటే కనీసం నాలుగు నుంచి ఆరు నెలల సమయం పడుతుంది. అలాంటిది రెండు మూడు నెలలకో అధికారిని మారుస్తూ.. వెళ్తే అధికారులు ఎలా పనిచేస్తారంటూ సామాన్యులు సైతం ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 13న రాచకొండ కమిషనర్‌గా ఉన్న డీఎస్ చౌహాన్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో సుధీర్‌బాబును నియమించారు. ఆ తరువాత రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో సాంకేతిక కారణాలతో ఆయనను బదిలీ చేసి.. ఆ స్థానంలో తరుణ్ జోషిని నియమించారు. తాజాగా, నాలుగోసారి తరుణ్‌జోషిని అక్కడి నుంచి బదిలీ చేసి తిరిగి సుధీర్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్ ఐజీగా ఉన్న సుధీర్‌బాబు అక్కడ పట్టు సాధిస్తుండగా, ఇక్కడ తరుణ్‌జోషి పట్టు సాధిస్తున్నారు. ఇంతలోనే ఈ బదిలీలు జరగడంపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఇదిలా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న గిరిధర్‌ను మూడు నెలల్లోనే వనపర్తి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయనను మొదట ఎస్‌వోటీ మల్కాజిగిరి డీసీపీ నుంచి ఈస్ట్‌జోన్‌కు బదిలీ చేశారు. ఆ తరువాత ఇప్పుడు మరోసారి బదిలీ అయ్యారు. మూడు నెలల కిందట సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌కుమార్‌రెడ్డిని మెదక్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో చంద్రమోహన్ నియమించారు. రాచకొండ ఎస్బీ డీసీపీగా ఉన్న బాలస్వామిని ప్రభుత్వం మెదక్‌కు..తాజాగా, ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ చేసింది. కార్ హెడ్‌క్వార్టర్స్ అదనపు సీపీ సత్యనారాయణ మల్టీజోన్-2 ఐజీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో డీసీపీ రక్షిత.కె మూర్తిని నియమించారు.

బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం భక్తుల కోలాటాల మధ్య బుధవారం సాయంత్రం కనులపండువగా జరిగింది. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేసి..రథోత్సవాన్ని ప్రారంభించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

రేపటి నుంచి 22వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

వచ్చే నెల 5న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

ఎర్రగడ్డ కార్పొరేటర్ మృతితో ఎన్నికకు షెడ్యూల్ విడుదల

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. 15 మంది సభ్యులతో స్టాండింగ్ కమిటీ ఏర్పడగా.. గత నెల 4న ఎర్రగడ్డ డివిజన్ ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు.

ఎన్నికల షెడ్యూల్ ఇదీ..

- ఈ నెల 12 (రేపటి) నుంచి 22వ తేదీ వరకు పబ్లిక్ హాలిడే మినహా (13, 14, 17, 21) నామినేషన్లను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) నామినేషన్లు స్వీకరిస్తారు.
- నామినేషన్లు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారు.
- ఈ నెల 23న నామినేషన్ల పరిశీలన
- 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు..ఆ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన.
- వచ్చే నెల 5న ఎన్నిక-జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ.
- అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి కౌంటింగ్, ఫలితాల వెల్లడి

అంబర్‌పేటలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

స్కూటీలేవీ? తులం బంగారమేదీ?

ఇస్తానన్న రేషన్ కార్డులేవీ?

అభివృద్ధిని గాలికి వదిలేసి వసూళ్లకు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట పర్యటనలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, జూలై 10 : రాష్ట్రంలో నిధులలేమి పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల బాగు కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బస్తీల్లో వీధి దీపాలు వేయడానికి జీహెచ్‌ఎంసీ వద్ద డబ్బు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు సరిగా అమలు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రేషన్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ ఆరు నెలలవుతున్నా.. ఆ ఊసెత్తడం లేదని ఆరోపించారు. 15 ఏండ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం అందుకోలేకపోతున్నారన్నారు. రేషన్ కార్డులు లేక చాలా మంది మహిళలు పొదుపు సంఘాల్లో చేరలేకపోతున్నారని, కొత్త గ్యాస్ కనెక్షన్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నెలలు గడస్తున్నా గుంతల రోడ్లకు మరమ్మతులు చేసే పరిస్థితి లేకపోవడం శోచనీయమన్నారు. ఆడపిల్లల పెండ్లిండ్లకు లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. ఆడ పిల్లలకు స్కూటీలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు అభివృద్ధిని గాలికి వదిలేసి రియల్ ఎస్టేట్‌ల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ సమస్యలపై ప్రశ్నించే వారే కరువయ్యారని, తాము నగర అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఏఎంహెచ్‌వోలకు మేయర్ హెచ్చరిక

సిటీబ్యూరో: డెంగీ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలితో కలిసి వైద్య ఆర్యోగ శాఖ, ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం కావడంతో దోమలతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మేయర్ అన్నారు. ఏఎంహెచ్‌వోలు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నమ్మకం కలిగించేలా ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి భరోసా కల్పించాలని కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయాలని కోరారు. అనంతరం 'జాయిన్ ది ఫైట్ అగెనెస్ట్ డెంగీ' అన్న నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలితో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవి కిరణ్, సీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజా రాణి, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నివారిద్దాం

వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ అధికారులకు సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వైద్య ఆరోగ్య, శానిటేషన్, ఎంటమాలజీ, మలేరియా విభాగాల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై బల్దియా కమిషనర్ ఆమ్రపాలితో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. నగరంలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, జ్వరాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం డెంగీ కేసుల విషయమై రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన చేస్తూ, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని క్రిస్టినా తెలిపారు. నగరంలో విస్తరిస్తున్న డెంగీ వ్యాధిని నియంత్రించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. వైద్యారోగ్య, శానిటేషన్, ఎంటమాలజీ, తదితర అనుబంధ విభాగాలు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తూ, అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని, వ్యాధుల పరిస్థితిపై రోజు వారీ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే చేసినప్పుడు గుర్తించిన జ్వరం కేసులకు సంబంధించి వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్ల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, డెంగీ తదితర కేసులు పెరగకుండా నియంత్రించడంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని క్రిస్టినా సూచించారు. ఈ సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజారాణి, ఎంటమాలాజీ చీఫ్ రాంబాబు, సంగారెడ్డి, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఈఎంహెచ్‌వో, డిప్యూటీ ఈఈలు, మలేరియా అధికారులు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ టన్నెల్ అసాధ్యమే

రూ.3వేల కోట్ల అంచనాతో..

బల్దియాకు నివేదిక సమర్పించిన ఏజెన్సీ

బంజారాహిల్స్ రోడ్ నం. 2లో భూ సేకరణ కష్టమేనంటున్న అధికారులు

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ) : కేబీఆర్ పార్కు చుట్టూ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రోడ్ టన్నెల్ చేపట్టాలన్న జీహెచ్‌ఎంసీ ప్రణాళిక కార్యరూపంలోకి రావడం అసాధ్యమేనని ఓ అంచనాకు వచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు భూ సేకరణకు రూ. 3వేల కోట్లు అవసరమవుతాయని సదరు ఏజెన్సీ ఇటీవల బల్దియాకు నివేదికను సమర్పించింది. సొరంగ పనుల కంటే బంజారాహిల్స్ రోడ్ నం .2 నుంచి , టన్నెల్‌కు ఇరువైపులా భూ సేకరణ కష్టమేనని సదరు ఏజెన్సీ పేర్కొందని ఓ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీనికి బట్టి చూస్తే..భారీ ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్టును చేపట్టడం అంత సులువు కాదని నిర్ధారించిన అధికారులు.. ఈ విషయాన్ని ప్రభుత్వ పరిశీలనలో పెట్టారు.

6.30 కిలోమీటర్ల మేర..

కేబీఆర్ పార్కు కింద సొరంగ మార్గంపై అధ్యయనానికి ఫిజిబులిటీ స్టడీ, డీపీఆర్ రూపకల్పనకు బల్దియా ఆర్వీ అసోసియేట్స్ ఏజెన్సీని ఖరారు చేసింది. ఈ క్రమంలో ఢిల్లీలోని రెండు టన్నెల్లను కమిటీ పరిశీలించింది. ప్రగతి మైదాన్ వద్ద 1.30 కిలోమీటర్ల మేర సొరంగమార్గం, ఆనంద్ విహార్ వద్ద సొరంగా మార్గం నిర్మాణం పనులపై అధ్యయనం చేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45 నుంచి కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం వరకు 1.70 కి.మీ, కేబీఆర్ ప్రధాన ద్వారం నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు 2 కిలోమీటర్లు, బంజారాహిల్స్ రోడ్ నం. 12 టన్నెల్ జాయినింగ్ పాయింట్ 1.10 కి.మీ, అప్రోచ్ రోడ్లు 1.50 కిలోమీటర్లు కలిపి మొత్తం 6.30 కిలోమీటర్ల మేర సొరంగాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. పార్కుపై ప్రభావం పడకుండా 100 అడుగుల లోతున సొరంగ మార్గం ఏర్పాటు కంటే.. భూ సేకరణ సులువు కాదని ఏజెన్సీ ఇచ్చిన నివేదికలో తేలింది. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

'సోలార్' మీటరింగ్.. తప్పడు రీడింగ్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సాహించాల్సిన విద్యుత్ శాఖ ఔత్సాహికులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. లక్షలు వెచ్చించి ఇండ్లపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను నెట్ మీటరింగ్ ద్వారా లెక్కించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా గోపన్‌పల్లిలో జర్నలిస్టు కాలనీ ఫేజ్-3లోని మోనార్క్ కాంప్లెక్స్‌లో అమర్చిన సోలార్ ప్యానళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను మీటరింగ్ తీసే సమయంలో పరిగణలోకి తీసుకోకుండా బిల్లులు జారీ చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని యూనిక్ సర్వీస్ నంబరు (యూఎస్‌సీ) 107498489 కలిగిన విద్యుత్ వినియోగదారులు తమ కాంప్లెక్సుపై సోలార్ విద్యుత్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంటును దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సరఫరా చేసే లైన్‌తో అనుసంధానం చేసి నెట్ మీటరింగ్‌ను సైతం ఏర్పాటు చేశారు. కాగా, ప్రతి నెలా మొదటి వారంలో జారీ చేస్తున్న విద్యుత్ బిల్లుల్లో సోలార్ విద్యుదుత్పత్తి యూనిట్లను పరిగణలోకి తీసుకోకుండా కేవలం తాము వాడిన మొత్తం యూనిట్లతో బిల్లు జారీ చేశారని, దీంతో జూన్‌కు సంబంధించిన నెల వారీ బిల్లు రూ. 43509.00లు వచ్చిందని వినియోగదారుడు గోపాల్‌రావు తెలిపారు. తమ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ ఎక్కడికి పోయిందని, దాన్ని ఎందుకు లెక్కించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇదే విషయమై విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గోపన్‌పల్లిలో యూనిక్ సర్వీస్ నంబరు 107498489పై బుధవారం 43509 రూపాయలతో జారీ చేసిన విద్యుత్ బిల్లు